


(తెలుగు కళా సమితి న్యూజెర్సీ) రాజాలక్ష్మీ ఫౌండేషన్ వారి



ఉపద్రష్ట సాయి

సుధీర్ అటువంటి కోరిక కోరుతాడని జయంతి ఏ మాత్రమూ వూహించలేదు. కాసేపు మౌనంగా నిలబ పోయింది. కారణం, సుధీర్ ఏమైనా అడిగితే అందులో అర్థం వుంటుంది. ఆషామాషీ కోరికలు కోరడు. కనుక అతని ప్రస్తుత కోరికను అంత తేలికగా తీసిపారవే యడానికి వీల్లేదు. అలాగని తీర్చడమూ సాధ్యం కాదు. 'మరిప్పుడేం చెయ్యడం' అను కుంది జయంతి. కళ్ళు మూసుకుని పడక కుర్చీలో కూర్చుని దీర్ఘంగా ఆలోచి స్తూంది.

చిన్నప్పటి నుంచి సుధీర్ పట్టుదల మనిషి. కిండర్‌గార్టెన్‌లో వున్నప్పుడే ఒకసారి మరో అబ్బాయి సుధీర్ తొడుక్కున్న చొక్కా బాగులేదన్నప్పుడు, మరునాడే కొత్త చొక్కా తొడుక్కు వెళ్ళి "ఇప్పుడు నీ చొక్కా బాగులే దుగా" అన్నవాడు సుధీర్. తన మనసును గాయపరిచే సంఘటన జరి గితే తట్టుకోలేడు. వీలైతే అలాంటి సంఘటనలు జరగకుండా వుండడా నికి ప్రయత్నిస్తాడు. ఆరు సంవత్సరాల వ్యవధిలో, రెండవ సంతానంగా పుట్టిన సుధీర్‌కు ఒక అక్క వుంది. కానీ సునంద ప్రస్తుతం అమెరికాలో భర్తతో కాపురం చేస్తూంది. ఉన్నదల్లా ఇప్పుడు సుధీర్ మాత్రమే కనుక అతని కోరి కలన్నీ వీలైనంత వరకు తీరుస్తున్నారు జయంతీ, జగన్నాథ్‌లు.

జగన్నాథ్ ఒక కంపెనీలో ఆఫీసు మేనేజరుగా ఉద్యోగం చేస్తున్నాడు. మధ్యతరగతి కుటుంబీకుడి క్రిందే లెక్క. సాధారణంగా మధ్యతరగతి కుటుంబాల జీవన విధానం మూస పోసినట్లే వుంటుంది. ఇంచుమిం చుగా కోరికలు కూడా ఒక్కలాగానే వుంటాయి. చిన్న ఫ్లాట్, మోటర్ బైక్, టి.వి., వీడియో, మిక్సీ, గ్రైండర్, వాషింగ్ మెషీన్ వగైరాలు, సుమా రైన కాన్వెంట్ చదువులు - ఇవి ఆ జీవన విధానంలో కనిపించేవి. వారాంతాల్లో టి.వి. సినిమాలు, లేదా అప్పుడప్పుడు కుటుంబంతో ఏ మంచి హోటల్లోనో రాత్రి భోజనాలు వారి వినోద కార్యక్రమాలలో ఒక భాగం. జీవన విధానంలో ఐశ్వర్యవంతులతో పోటీపడే భావన వారిది.

ఈ మూస ప్రకారమే సాగేది జగన్నాథ్ కుటుంబ జీవితం. అలాగే మధ్యతరగ తికి మాత్రమే పరిమితంకాని, మిగతా వర్గాలలో కూడా వున్న కొన్ని లక్ష ణాలు కూడా వున్నాయి. అవి, అవస రమైన ఆడంబర జీవితం, తాహతుకు మించిన కోరికలు, తను, తనవాళ్ళు మాత్రమే అన్న భావన, స్వలాభం, సొంత గొప్పలు చెప్పుకోవడం, ఫాల్స్

●●●●●●●

●●●●●●●

ప్రిస్టేజ్.

మంచి కన్నా చెడు త్వరగా తన ప్రభావాన్ని చూపిస్తుంది. ఇది అన్ని వర్గాలకు వర్తిస్తుంది. అవకాశవాదం, చెడును త్వరగా తనలోకి చేర్చుకుం టుంది. తనకు తెలియకుండానే సగటు భారతీయుడు విదేశీ నాగ రికతకు అలవాటుపడిపోతూ, మన సామాజిక విలువలను పూర్తిగా మరి చిపోతున్నాడు. ఈ రకమైన ప్రవర్తనకు జగన్నాథ్ కూడా అతీతుడు కాడు. జయంతీ అంతే.

సుధీర్ కోరిన కోరిక జయంతిని కలవరపెట్టడంతోబాటు ఆలోచింపజే సింది. "సాయంత్రం జగన్నాథ్ రాగానే ఈ విషయం చెప్పాలి. ఈ సమ స్యను వెంటనే పరిష్కరించుకోవాలి" అనుకుంది జయంతి. అయినా ఆమె మనసు కుదుటపడలేదు. సాయంత్రం దాకా ఆగే ఓపిక లేదు. "భర్తకు ఫోన్ చేసి చెప్తే" అనుకుంది. "ఈ విషయాన్ని వివరంగా ఫోన్‌లో చెప్పడం కష్టం. అలా చెప్పినా విషయం వినగానే జగన్నాథ్ కొంచెం భయపడే అవకాశం వుంది. అందుకు కారణం ఒక్కటే. సుధీర్ మొండితనం. నిజానికి సుధీర్ మొండివాడు కాడు. తను నమ్మిన మంచిని విశ్వసించేవాడు. ఆ మంచి కోసం ఎంత కష్టమైనా పడతాడు. తల్లిదండ్రులతో దెబ్బలాడవలసి వస్తే వెనుకాడడు. కొన్ని రోజులు మౌనంగా కూడా వుండగలడు. స్కూల్లో కూడా, సంఘసేవా కార్యక్రమాలలో చురు కుగా పాల్గొనే విద్యార్థి. కనుక పట్టుదల గల కొడుకుగా సుధీర్ పట్ల జగన్నాథ్‌కు నమ్మకముంది.

అయితే, ఇప్పుడు అతను కోరిన కోరిక కాస్త విడ్డూరంగా వుంది.

ఇప్పటివరకు అతను అలాంటి కోరిక కోరుతాడని జయంతిగానీ, జగన్నాథ్ గానీ వూహించి వుండరు కూడా.

కానీ సుధీర్ కోరనే కోరాడు.

'మరిప్పుడేం చెయ్యాలి?' అనుకునేలా చేశాడు సుధీర్. బరువుగా కాలం

## కథల పోటీలో రూ. 500/-లు బహుమతి గెలుచుకున్న కథ

కదులుతూంది. అంతకన్నా మెల్లగా బరువెక్కిన జయంతి మనసు పరి పరి విధాల ఆలోచిస్తూంది. మెల్లగా సాయంత్రమైంది.

జగన్నాథ్ రానే వచ్చాడు.

ట్రాఫిక్ టెన్షన్ తగ్గడానికి కాసేపు వ్యవధినిచ్చింది జయంతి. బట్టలు మార్చుకుని, మొహం కడుక్కుని బాల్కనీలో కూర్చుని వూలమొక్కల కేసి చూస్తున్న జగన్నాథ్ దగ్గరికి చేతిలో కాఫీ కప్పుతో వచ్చింది జయంతి.

"సుధి రాలేదా ఇంకా?" అడిగాడు జగన్నాథ్.

"వచ్చాడు – మళ్ళీ ట్యూషన్ సెంటర్‌కు వెళ్ళాడు" చెప్పింది జయంతి.

"ఈ ఏడు వాడు బాగా చదవాలి. లేకపోతే మెడిసిన్ సీటు రాదు" అన్నాడు జగన్నాథ్.

జయంతి ఏమీ మాట్లాడలేదు. మౌనంగా నిల్చుంది. తాను అనుకున్నది సాధించే వరకు లేదా ఎవరైనా తన మనసును బాధపెడితే తప్ప ఆ రకంగా వుండని జయంతి వాలకాన్ని గమనించిన జగన్నాథ్ జయంతినే అడిగాడు.

"అదోలా కన్ఫ్యూజ్డ్‌గా వున్నావు" అని.

అంతే మధ్యాహ్నం సుధీర్‌కు, తనకూ మధ్య జరిగిన విషయం గురించి చెప్పింది – అతని కోరిక గురించి కూడా చెప్పింది.

ఈసారి ఆశ్చర్యపోవడం జగన్నాథ్ వంతు అయింది.

"అసలెందుకు ఇటువంటి కోరిక కోరాడు? వాడికిప్పుడిక్కడ ఏం సరిగ్గా జరగడం లేదని? అసలు అటువంటి ఆలోచన వాడికి రావడానికి కారణం ఏమిటి?" ప్రశ్నల వర్షం కురిపించాడు జగన్నాథ్.

"అదే నాకూ అర్థంకావడంలేదు. మీరడిగిన ప్రశ్నలన్నీ నేనూ అడిగాను. వాడు దేనికీ సమాధానం చెప్పడం లేదు. ఇక్కడి కన్నా నేను అక్కడ ప్రశాంతంగా చదువుకోగలను, కనుక హాస్టల్లో వుంటాను. కాలేజీ హాస్టలులో ఫ్రెండ్స్ వుంటారు నాతో. నాన్నగారితో చెప్పి ఏర్పాటుచెయ్యి" అన్నాడు అంతే.

"ఇక్కడ వాడికి లోటు ఏముందని? అడిగినవన్నీ సమకూరుస్తున్నాముగా. వాడికంటూ ఓ గది వుంది. ప్రశాంతతకు ఏ భంగమూ కలగదు. మరెందుకని..." ఏదో అడగబోతున్న జగన్నాథ్‌తో

"అదేదో వాడినే అడగండి" అంది జయంతి.

రాత్రి సుధీర్ ఇంటికి వచ్చింతర్వాత, భోజనాలు పూర్తయ్యాక, జగన్నాథ్ సుధీర్‌ను పిలిచి

"హాస్టల్లో చేరుదామనుకుంటున్నావా సుధీ" అడిగాడు.

"అవును" క్లుప్తంగా చెప్పాడు సుధీర్.

"ఎందుకురా! ఇక్కడ నీకేం తక్కువైందనీ" అన్నాడు జగన్నాథ్.

"నాన్నా మీరు చేసినదాని గురించో, చెయ్యని దాని గురించో నేను చెప్పడం లేదు. మరీ ఆరాలు తీయకుండా హాస్టల్లో నన్ను చేర్చండి. మీ మీద కోపమో, ద్వేషమో నాకు లేదు. అక్కడ నా ఈడు స్నేహితులతో కలిసి సంతోషంగా వుంటూ చదువుకుంటాను. మీరు కూడా అడపాదడపా వచ్చి నన్ను చూడవచ్చు" అన్నాడు సుధీర్.

"బాగుందిరా వరస. ఉన్న వూళ్ళోనే కొడుకు హాస్టల్లో వుండి చదువుకుంటున్నాడంటే అందరూ ఏమనుకుంటారు? మీ అక్క విదేశాల్లో వుంది. నువ్వు కూడా దూరమైతే మేమిద్దరం ఒకరి మొహాలొకరు చూసుకోవాలి. పై చదువులకో, ఉద్యోగం కోసమో బయట ఊరు వెళ్ళావంటే తప్పదు. ఉన్న వూళ్ళోనే హాస్టల్లో వుంటాననడం..." ఇంకా జగన్నాథ్ మాట్లాడేలోగా

"చూడు సుధీ! చిన్నప్పటి నుంచీ నిన్ను ఎంత ప్రేమగా పెంచానో నీకు తెలుసు. ఒక్కగానొక్క కొడుకని గారాబంగా పెంచాను. పది నిమిషాలు ఆలస్యంగా వస్తే, వచ్చేదాకా గేటు దగ్గరే నిలబడేదాన్ని. ఏం కావాలన్నా కొనిస్తూ ప్రాణానికి ప్రాణంగా పెంచాను. నువ్వేనా నాకు దూరంగా వున్న వూళ్ళోనే హాస్టల్లో వుంటానంటున్నావు" అడిగింది జయంతి.

"అవునమ్మా! నేనే. ఎందుకో తెలుసా? ఒక తల్లిగా నీకు నీ కొడుకు నీతోనే వుండాలని వుంది కదా?" అడిగాడు సుధీర్.

"అవును" అంది జయంతి.

"అలాగే... నాయనమ్మ కూడా తన ఒక్కగానొక్క కొడుకుతో, ముఖ్యంగా ముసలితనంలో వుండాలని కోరుకోవడం న్యాయం కాదా? మరి పాపం... నాయనమ్మను వున్న వూళ్ళోనే వృద్ధుల సంక్షేమకేంద్రంలో చేర్పించారు. మరి ఆ తల్లి మనసు నీలాగానే బాధపడుతుందని మీకు అనిపించలేదా? మనిషి మనిషికీ నీతి మారదమ్మా. ఏ తల్లికైనా కొడుకుతో వుండాలనే వుంటుంది. నీలాగనే నన్ను నాయనమ్మ కూడా గారాబంగా పెంచింది. మరి... ఆమెకు నేనేం చెయ్యగలిగాను. నేను చిన్నవాడిని. మిమ్మల్ని శాసించలేను. కనుక నేను కూడా మీకు దూరంగా, హాస్టల్లో నాయనమ్మలా వుంటే, మీకు నేను లేని బాధ అర్థమవుతుందనీ, అలాగే నాయనమ్మ బాధ కూడా తెలుస్తుందనీ అనుకుని హాస్టల్లో చేరుతానన్నాను. అంతే. నాయనమ్మను మళ్ళీ ఇంటికి పిలుచుకువస్తే నేనూ ఇంట్లోనే వుంటాను. లేదా... తన తల్లికి మా నాన్న చూపిన దారే... మరో విధంగా... అంటే నేనే దూరంగా వెళ్ళిపోతూ నీకు చూపిస్తాను. ఇది మమకారాల మధ్య జరిగే సంఘర్షణ. ఎవరి మీదా ద్వేషం లేదు నాకు... రాజీ ప్రసక్తి లేదు" అన్నాడు సుధీర్.

జయంతి, జగన్నాథ్‌ల మొహాలలో నెత్తుటి చుక్కలేదు.

నిశ్చేష్టులై నిలబడిపోయారు.

సరిగ్గా ఇరవై నాలుగ్గంటలలోగా నాయనమ్మ సుధీర్‌ను తన దగ్గర తీసుకుంది ఇంట్లో.



*

ఆధునిక జీవితం అవసరానికిచ్చినంత ప్రాముఖ్యం అనుబంధాలకివ్వడం లేదు. నేర్చుకున్న పాఠాన్ని మరచినవాళ్ళకు అప్పుడు పాఠం చదువుకుంటున్న వాళ్లు జ్ఞాపకం చెయ్యకపోతే మరెవరు చేస్తారు?

*